# సింగిల్ పేజీ కథలు

## సహాజ

**రాత్రి ఆ సంఘటన జరిగిన దగ్గర నుంచీ సహజ మనసు చాలా ఆందోళనగా, అశాంతిగా మారింది. ఒకటే ఆలోచనలు మనసును చెదపురుగుల్లా తొలిచేస్తున్నాయి. ఏ పని మీద ఏకాగ్రత నిలపలేకపోతోంది. మనసులో కలుగుతున్న సందేహాలు నిజం కాకూడదని దేవుడిని ప్రార్థించుకోసాగింది.**

నిన్న తన ఫ్రెండ్ కల్యాణి బర్త్‌డే అని తనను బలవంతంగా ఫస్ట్ షో సినిమాకి లాక్కెళ్లింది. క్యూలో నిలబడి టికెట్స్ తీస్తుండగా తన భర్త నరేష్ ఎవరో ఆమెతో థియేటర్‌లోకి వెళ్లడం తమ కంటపడింది. తెరమీద సినిమా జరుగుతున్నా తన దృష్టి తమకు రెండు లైనుల ముందు కూర్చున్న వాళ్లిద్దరి మీదే ఉంది.

ఆమె ఎంతో చొరవగా తన భర్త భుజానికి తల ఆన్చి ఏదో మాట్లాడుతోంది. అంటే ఆమెకు తన భర్త చాలా పరిచయం ఉందన్న మాట. ఇంతకు ముందు ఆమెను తను ఎక్కడా చూడలేదు. తన భర్తయినా ఆమె గురించి ఎప్పుడూ చెప్పలేదు.

సహజకు అంతకు ముందు జరిగిన సంఘటనలు గుర్తుకు రాసాగాయి. ఓరోజు తను బాబాయ్‌గారు అని పిలిచే హౌస్ ఓనర్ సుందర్రావ్‌గారు వంట చేస్తుండగా వచ్చి "అమ్మాయ్ సహజా! నీకో విషయం చెప్పాలి. నువ్వేం అనుకోవుగా" అన్నారు సంశయిస్తున్నట్టుగా ఆగి.

"నేనేమనుకోను బాబాయ్‌గారు, ఏ విషయమో చెప్పండి" అంది నవ్వుతూ.

ఆయన ఇంకా చెప్పడానికి తటపటాయిస్తుండగా "పర్వాలేదు చెప్పండి" అంది.

ఆయన కాస్త గొంతు సవరించుకుని- "ఇవాళ ఉదయం నేను సూపర్ మార్కెట్‌కి వెళ్లినప్పుడు అక్కడకి మీ ఆయన ఎవరో అమ్మాయిని వెంటబెట్టుకుని వచ్చాడమ్మా. నన్ను మీ ఆయన చూడలేదు. కానీ వాళ్లిద్దరూ చాలా చనువుగా తిరిగారు. ఎందుకైనా మంచిదని నీకు చెప్పాను" అని ఆయన వెళ్లిపోయారు.

అప్పుడు తను నవ్వుకుంది. భర్త ఏ కొలీగ్‌తోనో తోడుగా వెళ్లుంటారు. దానికే బాబాయ్‌గారు అనుమానపడి తనకు చెప్పారు. పెద్దవాళ్లకు కాస్త చాదస్తం ఉంటుంది కదా అని ఊరుకుంది. తర్వాత అలాగే ఈవెనింగ్ వాక్‌కి బీచ్‌కి వెళ్లినప్పుడు మళ్లీ వాళ్లిద్దరూ కనిపించారని బాబాయ్‌గారు చెప్పారు. అప్పుడు కూడా తను సందేహించలేదు. ఎందుకంటే ఇంతవరకు భర్తకూ తనకూ మధ్య అభిప్రాయ భేదాలు కలగలేదు. ఏ విషయంలోనూ గొడవ పడలేదు.

ఎప్పుడైనా సరదాగా పక్కింటి పోర్షన్‌లో అద్దెకుండే నివాస్‌గారిని ఏ విషయంలోనైనా మెచ్చుకుంటే సహించలేకపోయేవాడు నరేష్. అదేమిటని తను ప్రశ్నిస్తే "నువ్వు



నన్నుగాక ఏ మగాడినైనా మెచ్చుకుంటే నేను భరించలేను. నువ్వు నన్నే మెచ్చుకోవాలి, ప్రేమించాలి, అభిమానించాలి" అనేవాడు. ఆ మాటలకు ఎంతో పొంగిపోయేది. తను కూడా అతని ప్రేమ తన ఒక్కదానికే చెందాలి అనుకోవడం వల్ల అంతకన్నా మరోలా భావించలేదు.

కానీ ఈమధ్య నరేష్ ప్రవర్తనలో ఏదో మార్పు కలిగింది. ఇంతకు ముందులా తనతో ఎక్కువగా గడపడం లేదు. బిజినెస్ టెన్షన్సేమో అని తను సరిపెట్టుకుంది. ఇన్నాళ్లూ ప్రత్యక్షంగా చూడకపోవడం వల్ల భర్త మీద అనుమానపడలేదు. కానీ నిన్న తన కళ్లతో వాళ్లిద్దరినీ, వాళ్ల మధ్య చనువుని చూసి తను ఎలా అనుమానించకుండా ఉండగలదు?

* * *

భోజనం చేసి నరేష్ గదిలోకి వెళుతుండగా "మీతో మాట్లాడాలి" అంది ముక్తసరిగా.

అతడు ఏమిటన్నట్టుగా చూసి సోఫాలో కూర్చున్నాడు.

"మీతో సినిమాకి వచ్చిన ఆమె ఎవరు?"

నరేష్ ఒక్క క్షణం కలవరపడ్డాడు. అంతలోనే సర్దుకుని "ఆమె నా ఫ్రెండ్" చెప్పాడు.

"ఫ్రెండ్ అంటే ఎలాంటి ఫ్రెండ్?"

"జస్ట్ ఫ్రెండ్"

"ఎప్పటి నుంచి సాగుతోంది మీ ఫ్రెండ్‌షిప్" వ్యంగ్యంగా అంది సహజ.

"అవన్నీ నీకనవసరం" నిర్లక్ష్యంగా బదులిచ్చాడు నరేష్.

ఆమె దిగ్భ్రాంతిగా చూస్తుండగానే తన గదిలోకి వెళ్లిపోయాడు.

* * *

"మళ్లీ ఇంకోసారి మీ ఆయనతో చెప్పు నాకు అలాంటివి నచ్చవని" కల్యాణి అంది.

"అవన్నీ అయిపోయాయి. నీకు ఏ లోటు లేకుండా చూస్తున్నాను కదా! ఆవిడ విషయం ఇక మరిచిపొమ్మని అన్నాడు" అంది సహజ.

కొంత నిశ్శబ్దం తర్వాత- "ఒక భార్య భర్త ఒక్కడినే మనసా, వాచా ప్రేమించినప్పుడు భర్త కూడా తనని అలా ప్రేమించాలని భావించడం తప్పా? అదేమైనా కోరరాని కోరిక?" అంది ఆవేదనగా సహజ.

"నీలాగే చాలామంది అనుకుంటే ఈ సమాజంలో ఎందరో భార్యాభర్తలు విడిపోయి వుండురు. కానీ అలా జరగట్లేదు కదా. జీవితంలో కొన్ని రాజీపడాలి" అనునయంగా అంది కల్యాణి.

"అందరూ ఏఏ కారణాల వల్ల రాజీపడి బ్రతుకుతున్నారో నాకనవసరం. ఆర్థిక పరిస్థితికి భయపడి కావచ్చు లేక సమాజానికి భయపడి కావచ్చు. వాళ్ల భయాలు వాళ్లవి. కానీ నేను నా మనసుని చంపుకుని బ్రతకలేను. అది నాకు చిన్నప్పటి నుంచీ అలవాటు లేదు. నాకు చీర కొనలేదు అని గానీ నగ చేయించలేదని గానీ బాధపడట్లేదు. నా భర్త మనసులో నా ఒక్కదానికే స్థానం లేదని బాధపడుతున్నాను" అంది కంఠం జీరబోగా.

చాలా రకాలుగా స్నేహితురాలిని కన్విన్స్ చేయడానికి ట్రై చేసింది కల్యాణి. కానీ సహజ నిర్ణయం ఎప్పుడో

తీసుకుంది.

* * *

"ఏమిటి నువ్వు చేసింది? అల్లుడితో తెగతెంపులు చేసుకునే వచ్చేశావా?" ఆందోళనగా అడిగింది తల్లి లలితమ్మ సహజని.

"అంతా విని కూడా అలా మాట్లాడతావేంటమ్మా? అతని మనసులో నాకు స్థానం లేనప్పుడు అక్కడ ఎలా ఉండగలను?" బాధగా అంది సహజ.

"అది కాదమ్మా! అల్లుడుగారితో మేము మాట్లాడతాం" అంది లలితమ్మ.

"అమ్మా! ఆయన ఇప్పుడు ఎవరు చెప్పినా వినే స్థితిలో లేరు. భవిష్యత్‌లో ఎప్పుడైనా నేను లేకండా ఉండలేనని ఆయన భావించి నా దగ్గరకు వస్తే అప్పుడు వెళ్తాను" తల్లితో అంది సహజ.

తల్లి ఇంకా ఏదో అనబోయేంతలో తండ్రి రాజారావు అడ్డు వచ్చారు.ఆయనకి కూతురి మనస్తత్వం బాగా తెలుసు. తను ఏ నిర్ణయం తీసుకున్నా బాగా ఆలోచించే తీసుకుంటుంది. తనేం చిన్నపిల్ల కాదుకదా తన జీవితం మీద అవగాహన లేకపోవడానికి- ఆమె నచ్చిన విధంగా జీవించగలదు.

"నీ ఇష్టం తల్లీ. నీకు నచ్చిన విధంగా చెయ్" అని ఆయన వెళ్ళిపోయారు.

తండ్రి తనకు సపోర్ట్ చేయడంతో చాలా సంతృప్తిగా ఫీలయింది సహజ. అందరి తండ్రుల్లా ఏదో విధంగా భర్తతో సర్దుకుపో అని అనకుండా తన మనసుని అర్థం చేసుకున్నారు. ఈమాత్రం తల్లిదండ్రుల సపోర్ట్ ఉంటే చాలు ఎవరి మీద ఆధారపడకుండా, ఆత్మాభిమానం చంపుకోకుండా బ్రతకగలదు. తను చదివిన చదువుకి ఏ చిన్న ఉద్యోగమైనా చేసుకుని ఎవరికీ భారం కాకుండా తను జీవించగలదు.

ఆ రాత్రి తన భవిష్యత్ గురించి ఆలోచిస్తూ ఎప్పుడో నిద్రలోకి జారుకుంది సహజ.

-రాఘవి (ఏలేశ్వరం)

# నిజాయితీ



**"ఏవండీ! డాక్టర్ చెప్పిన డ్యూ డేట్‌కి ఇంకా వారం రోజులున్నా ఇవాళో రేపో డెలివరీ అయ్యేట్టుంది నా పరిస్థితి. డాక్టర్ ఆపరేషన్ చెయ్యాల్సొస్తుందని చెప్పింది. ఆఫీసుకెళ్లి ఓ వారం రోజులు లీవు పెట్టి, జీతం అడ్వాన్సు తీసుకు రండి. డెలివరీ టైములో మీరు నాతో ఉంటే ధైర్యంగా ఉంటుంది" అని ఉదయం డ్యూటీకొచ్చేటప్పుడు భార్య చెప్పిన మాటలు గుర్తొచ్చి మేనేజర్ గదికెళ్లి, పరిస్థితి చెప్పాడు శంకర్.**

"రేపు మన కంపెనీకి ఆస్ట్రేలియా ఎన్నారై వస్తున్నారు. ఆయన్ని కార్లో తీసుకురావాలి. నీకు లీవిచ్చి, ఇంపోర్టెడ్ కారుకి వేరే వాళ్లని డ్రైవర్‌గా నియమించడం కుదరదు. వచ్చేవారం లీవు తీసుకో" అనేసరికి జీతం అడ్వాన్సు సంగతి పెదవి దాటలేదు.

ఆరోజు రాత్రి భార్యకి పరిస్థితి చెప్పి, తోడుగా తల్లిని తీసుకొచ్చి డబ్బు ఏర్పాటు చేసి, మర్నాడుదయం డ్యూటీకి వచ్చాడు శంకర్.

* * *

ఆరోజొచ్చిన ఆస్ట్రేలియా ఎన్నారైతో మధ్యాహ్నం వరకూ డిస్కషన్స్ జరిపిన ఎం.డి, లంచ్ తర్వాత గేటు వరకూ వచ్చి ఆయన్ని కారెక్కించాడు. కారులో కూర్చున్న ఆ ప్రవాసాంధ్రుడు ఆస్ట్రేలియాలో సెటిలై మంచి పొజిషన్‌లో ఉన్న విజయవాడ వాసి. ఆరోజంతా సిటీలో ఆయన చూడాలనుకున్న ప్రదేశాలన్నిటికీ తీసుకెళ్లిన శంకర్, మర్నాడు కారులో ఆయన్ని విజయవాడ దగ్గరున్న ఆయన స్వస్థలానికి, బంధువుల ఇళ్లకి తీసుకెళ్లాడు. మొత్తానికి రెండ్రోజుల్లో వీలైన ప్రదేశాలన్నిటినీ తిప్పి చూపడమే కాక ఆయా ప్రదేశ ప్రాముఖ్యతనూ వివరించి చెప్పి, అతని అభిమానానికి పాత్రుడయ్యాడు.

* * *

మూడోరోజు ఉదయం కంపెనీ మేనేజర్, పి.ఎ. చక్రపాణిని కలిసి కార్లో ఆస్ట్రేలియా ఆంధ్రుడు బస చేసిన స్టార్ హోటల్‌కొచ్చి, ఆయన్ని పికప్ చేసుకుని, ఎయిర్‌పోర్టుకి తీసుకెళ్లాడు శంకర్. ఎం.డి. తన కారులో ఎయిర్‌పోర్టుకి చేరుకున్నాడు. ఫ్లయిట్ బయలుదేరడానికి ఇంకా సమయముంది. మాటల మధ్యలో-ఇరవై ఏళ్ల తర్వాత ఆంధ్రా వచ్చిన తనని ఈ రెండ్రోజుల్లో ఎన్నో ప్రదేశాలు ఓపిగ్గా తిప్పి చూపడమే కాక, ఓ గైడ్‌లా అన్నీ వివరించి చెప్పాడని ఎం.డి.కి చెబుతూ, వాళ్లకి కొద్ది దూరంలో చేతులు కట్టుకుని నిలబడిన శంకర్‌ని పిలిచి, ఐదువేల రూపాయలు తీసిస్తూ "ఇవి తీసుకో శంకర్! నాకున్న వసతికి ఇదేమంత ఎక్కువ కాదు. నా గుర్తుగా దేనికైనా ఉపయోగించుకో" అని ఇవ్వబోతుంటే శంకర్ నిరాకరించాడు. అతడెంత బలవంతపెట్టినా శంకర్ తీసుకోకపోవటం అతడిని ఆశ్చర్యపరిచింది.

ఫ్లయిట్ టేకాఫ్ అయ్యాక కారులో వెనక సీట్లో మేనేజర్, ముందు సీట్లో పి.ఎ.చక్రపాణి కూర్చున్నారు. కారు వేగంగా పోతోంది. మేనేజర్ పేపరులో నిమగ్నమయ్యాడు.

పి.ఎ.చక్రపాణి మంద్రస్వరంతో "ఆ పెద్దమనిషి డబ్బిస్తే, పిచ్చివాడిలా వద్దన్నావేమిటయ్యా! మొన్నొచ్చి భార్యకి డెలివరీ టైము లీవు కావాలి, జీతం అడ్వాన్సు కావాలి అనడిగావా? ఇప్పుడా డబ్బు తీసుకుంటే ఉపయోగపడేదా?" అన్నాడు.

"పాణీ సార్! ఇంత పెద్ద కంపెనీలో పని చేస్తున్న నేను చేసిన డ్యూటీకి, ఎవరో తెలియని వ్యక్తి తన ఔదార్యాన్ని డబ్బు రూపంలో మన ఎం.డి. ముందు ఇవ్వజూపడం, అతనిది పెద్ద మనసు కావచ్చు కానీ దాన్ని తీసుకుంటే మన కంపెనీ పేరు, ఎం.డి.గారి పరువు తీసినట్టవుతుంది. అది నా మనస్తత్వానికి విరుద్ధం. అవకాశం దొరికిందని విచక్షణ కోల్పోకూడదు సార్" అన్నాడు.

కారు మరో పది నిమిషాల్లో కంపెనీ ఆవరణలోకి ప్రవేశించింది. కారు గారేజీలో పెట్టి వెళుతున్న శంకర్‌ని, తన ఛాంబర్‌కి రమ్మన్నాడు మేనేజర్.

శంకర్ అడిగిన లీవు, జీతం అడ్వాన్సులతోపాటు అతని నిజాయితీకి గుర్తింపుగా ఓ గిఫ్ట్‌చెక్ ఇచ్చాడు మేనేజర్.

-ఎం.వెంకటేశ్వరరావు (సికిందరాబాద్)